ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.35 | సహర్ : 4.40 (సోమవారం)
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
ఆదివారం 31 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.145	212	242
నల్లగొండ	రూ.146	210	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 కనిష్ఠం 24.2


సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదు

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, మార్చి 30 : పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు అడిగే నైతికహక్కు లేదని, ఆ పార్టీలకు డిపాజిట్ గల్లంతవడం ఖాయమని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మట్టపల్లి గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఇస్తామన్నారు. రాష్ట్ర విభజన సమయంలో రైల్వేజోన్, స్టీల్‌ప్లాంటు, గిరిజన యూనివర్సిటీలను ఇవ్వాలని చట్టంలో పేర్కొన్నా బీజేపీ పదేళ్లలో అమలు చేయలేదన్నారు. ఐటీఐఆర్ హైదరాబాద్‌కు రావాల్సి ఉండగా మోదీ రాకుండా చేశారని అందుకే తెలంగాణలో బీజేపీకి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని నమ్మబలికారని, కానీ సగానికిపైగా రైతుల ఆదాయం పడిపోయిందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, ప్రతీ పేదవాడి ఖాతాలో రూ.15లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి ఏఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఈ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మనుగడ కోల్పోతుందన్నారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి దేశంలో అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లలో జిల్లాలో చరిత్రలో జరగని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు.



కరువు యాత్ర చేస్తావా, కేసీఆర్ సిగ్గుండాలి

పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, ఓటమిని జీర్ణించుకోలేని కేసీఆర్, కరువు యాత్ర చేస్తావా సిగ్గుండాలి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం కరువు బారిన పడటం కేసీఆర్ చేసినపాపమేనన్నారు. స్వాతంత్ర్యానంతరం జరిగిన ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ అభ్యర్థి రావి నారాయణరెడ్డి దేశంలో అత్యధిక మెజార్టీతో గెలిచారని, ఆ మెజార్టీ రఘువీర్‌రెడ్డి దాటుతారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రస్తావనే రాదన్నారు. పని చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. హుజూర్‌నగర్, నల్లగొండ నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు తెచ్చేందుకు తనకు, మంత్రి ఉత్తమ్‌కు మధ్య పోటీలా పనిచేస్తామన్నారు.



25 ఏళ్ల వయస్సు నుంచి ప్రజల కోసం పని చేస్తున్నా..

తాను 25 ఏళ్ల వయస్సు నుంచి పేదల కోసం పనిచేస్తున్నానని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేశానని, తన తనయుల ద్వారా పేదలకు న్యాయం చేయడంతో పాటు ఈ జిల్లాను మరింత అభివృద్ధి చేయాలనేదే తన కోరిక అన్నారు.



జానారెడ్డి తన వారసులను పార్టీకి అందించారు

జానారెడ్డి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో బడుగు, బలహీన వర్గాల వారికి అండగా ఉన్నాడని, ఆయన కోవలోనే నడిచేందుకు తన కుమారులు ఇద్దరినీ పార్టీ సేవలకు అందించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జానారెడ్డి తనకు రాజకీయ గురువని, 2023లో జరిగిన ఎన్నికల్లో ఖమ్మం నుంచి పోటీ చేయాలని చెప్పింది ఆయనే అన్నారు.



పార్టీకి, పేదలకు సేవ చేయడమే మా నైజం

తండ్రి జానారెడ్డి ప్రజలకు ఎంతో సేవ చేశారు, ఆయన ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసేందుకు వచ్చానని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. పార్టీకి, పేదలకు సేవ చేయడమే తమ నైజమన్నారు. ఎప్పుడూ ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించినట్లే ఈ ఎన్నికల్లోనూ గెలిపించాలన్నారు. భారీ మెజారిటీతో తనను గెలపించాలని కోరారు.




సన్నాహక సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

పొలిటికల్ హీట్!

» పోటాపోటీగా రాజకీయ కార్యక్రమాలు
» అట్టహాసంగా కాంగ్రెస్ 'లోక్‌సభ' ప్రచారం ప్రారంభం
» నేడు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న మాజీ సీఎం కేసీఆర్
» ఈసారి సత్తాచాటేలా బీజేపీ అడుగులు


లోక్ సభ ఎన్నికల హడావిడి మొదలవడంతో ఉమ్మడి నల్లగొండ జి ల్లాలో రాజకీయం వేడెక్కింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహ, ప్రతివ్యూహాలతో రక్తికట్టిస్తున్నాయి. శనివా రం నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నిక ల ప్రచారాన్ని అత్యంత అట్టహాసంగా ప్రారంభించిన కాంగ్రెస్ నేతలు రికార్డు మెజార్టీ సాధిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు జిల్లాలో పట్టుసాధించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుందనే అంశంపై ఫిబ్రవరిలో ఒక పర్యాయం జిల్లాలో భారీ బహిరంగసభ నిర్వహించిన మాజీ సీఎం కేసీఆర్, తాజాగా కరువు నేపథ్యంలో రైతులను పరామర్శించేందుకు ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నారు. మరోవైపు బీజేపీ సైతం జిల్లాలో సత్తాచాటాలనే సంకల్పంతో ముందుకెళుతోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌కు పోటీనే లేదని, దేశంలోనే రికార్డు మెజార్టీతో గెలిపిస్తామని జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తేల్చి చెబుతున్నారు. గతానికి భిన్నంగా శనివారం నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి తరుపున ఎన్నికల ప్రచారాన్ని అత్యంత అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీమంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో పాటు బూత్‌లెవల్ స్థాయి నుంచి పార్టీ కార్యకర్తలను ఈ సమావేశానికి తరలించారు. పార్లమెంట్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన నియోజకవర్గం హుజూర్‌నగర్ పరిధిలోని మట్టపల్లిలో ఈ పార్లమెంటరీ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని భారీస్థాయిలో నిర్వహించారు.సమావేశంలో ఆద్యంతం మంత్రులు, ఎమ్మెల్యేలు రాబోయే లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటాపోటీగా మెజార్టీ ఇప్పిస్తామని ప్రకటించడం ఆ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. ఒకవైపు ఎన్నికల ప్రచార సన్నాహాల్లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీని విమర్శలతో దుయ్యబడుతున్నారు. గత ప్రభుత్వ వైఫల్యాల పేరుతో బీఆర్ఎస్‌పై దూకుడుగా వెళుతున్నారు. బూత్‌లెవల్ స్థాయి నుంచి నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు ప్రతిపక్షాల్లో బలమైన నాయకులు, కేడర్ ఉంటే కాంగ్రెస్‌లోకి రప్పించుకుంటూ కండువాలు కప్పేస్తున్నారు. ముప్పేట దాడితో ప్రతిపక్షాలపై కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తుండడం లోక్‌సభ ఎన్నికలను ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయాన్ని తెలియజేస్తోంది.

ఉమ్మడి జిల్లాపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి

ఉమ్మడి జిల్లాపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ సైతం ప్రత్యేక దృష్టినే కొనసాగిస్తోంది. కృష్ణానదీ జలాల్లో తెలంగాణ హక్కులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందనే అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై ఫిబ్రవరిలో మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో బహిరంగసభ నిర్వహించారు. ఇటీవల ఆయకట్టుకు సాగు నీరందకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో పంటపొలాలు ఎండిపోయి రైతులు అవస్థలు పడుతున్న అంశంపైనా, పండ్లతోటల రైతు లు మళ్లీ బోరుబావుల వైపు చూస్తున్న అంశంపై బీఆర్ఎస్ వేగంగా స్పందించింది. అధికార కాంగ్రెస్ వైఫల్యమే జిల్లా కరువుకు కారణమని మాజీ మంత్రి జగదీ‌శ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ నేతలు పర్యటించగా, తాజాగా ఆదివారం ఉమ్మడి జిల్లాలో పంటలు ఎండిన పొలాలను పరిశీలించే నిమిత్తం మాజీ సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నారు. మరోవైపు మాజీ మంత్రి జగదీ‌శ్‌రెడ్డికి, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నడుమ నిత్యం మాటల యుద్ధం సాగుతోంది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పార్టీ బలోపేతానికి, సీట్లు గెలవడానికి బీజేపీ ప్రత్యేక స్కెచ్ అమలుచేస్తోంది. బీఆర్ఎస్ కే చెందిన మాజీ ప్రజాప్రతినిధులకే రెండు ఎంపీ సీట్లు కేటాయించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటింగ్‌ని తమవైపు తిప్పుకోవాలని, కాంగ్రెస్ వ్యతిరేక ఓటు కూడా తమ వైపే వచ్చేలా కార్యాచరణ చేపట్టారు.



నేడు ఉమ్మడి జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్



సూర్యాపేట(కలెక్టరేట్)/ మిర్యాలగూడ/ నిడమనూరు : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 8.30కు సిద్ధిపేట జిల్లా ఎర్రవెల్లి నుంచి రోడ్డు మార్గంలో 10.30కు జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధారావత్‌తండాలో ఎండిన పొలాలను పరిశీలిస్తారు. 11.30కు సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, అర్వపల్లి మండలాల్లో, మధ్యాహ్నం 1 గంటకు సూర్యాపేట మండలంలో ఎండిన పొలాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1.30కు సూర్యాపేటలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయానికి చేరుకొని కొంతసేపు విశ్రాంతి తీసుకుంటారు. 2 గంటలకు అక్కడే మధ్యాహ్నభోజనం చేస్తారు. 3 గంటలకు విలేకరుల సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతారు. 3.30కు అక్కడి నుంచి బయలుదేరి 4.30కు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలానికి చేరుకొని అక్కడ ఎండిన పంటపొలాలను పరిశీలిస్తారు. సాయంత్రం ఆరుగంటలకు నిడమనూరు మండలం నుంచి బయలుదేరి నల్లగొండ మీదుగా రాత్రి 9 గంటలకు తిరిగి ఎర్రవెల్లికి చేరుకుంటారు.

నాడు నిండే.. నేడు ఎండె

» ఎస్సారెస్పీ నీటితో గతేడాది పుష్కలంగా పంటలు
» నేడు కరువుతో ఎండిపోతున్న వైనం


తుంగతుర్తిలో ఎండిన వరి

మోత్కూరు, మార్చి 30 : కరువు పరిస్థితులు రాజకీయాలకు వేదికగా మారాయి. పార్టీలు కరువుపై ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో రైతుల పరిస్థితిపై చర్చ మొదలైంది. చేతికందే దశలో వరి పంట ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి డివిజన్‌లో గత ఏడాది ఎస్సారెస్పీ కాల్వల్లోకి నీరు పుష్కలంగా వదలడంతో తిరుమలగిరి(కొంత భాగం), నాగారం, అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో చెరువులు, కుంటలు నింపారు. దీంతో బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరిగి డివిజన్‌లో ఒక లక్షా ఇరవై వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట చేతికి వచ్చింది. ఈ యాసంగి కూడా కాల్వల ద్వారా నీరు వస్తుందని భావించి తుంగతుర్తి మండలంలో 10,277 మంది రైతులు 20,321 ఎకరాల్లో, తిరుమలగిరి మండలంలో 7,949 మంది రైతులు 13,967 ఎకరాల్లో, నూతనకల్ మండలం లో 6,270 మంది రైతులు 11,685 ఎకరాల్లో, నాగారం మండలంలో 8,917 మంది రైతులు 17,751 ఎకరాల్లో, మద్దిరాల మండలంలో 6,631 మంది రైతులు 13,101 ఎకరాల్లో, అర్వపల్లి మండలంలో 9,248 మంది రైతులు 18,911 ఎకరాల్లో వరి సాగు చేశారు. డివిజన్‌లో మొత్తం 95,739 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎస్సారెస్పీ కాల్వలకు వారబందీ పద్ధతిలో నీరు వదలడంతో చెరువులు, కుంటలు ఎండి బావులు, బోర్లలో భూగర్భజలాలు అడుగంటి వరి పంట ఎండిపోతోంది. డివిజన్‌లో సుమారు ఐదు వేల ఎకరాల్లో వరి పంట ఎండినట్లు అనధికారిక అంచనా. ఎకరాకు రూ.25 వేలు ఖర్చుచేసి వరి సాగు చేస్తే చేతికందే దశలో పంట కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొందరు ఎండిన పంటను పశువుల మేపుతుండగా, పశువులు లేని వారు అలాగే వదిలేశారు. నీటి ఎద్దడితో ఎండిన పంటకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నాలుగు ఎకరాలు నాటేస్తే మూడెకరాలు ఎండిపోయింది



తుంగతుర్తిలో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. రూ.లక్షకు పైగా ఖర్చు చేశా. నీరు లేక నోటికాడికి వచ్చిన మూడు ఎకరాల వరి పంట ఎండిపోయింది. పెట్టుబడితో పాటు భూమి కౌలు కూడా మీదపడింది. ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

- బోయిని నాగయ్య, కౌలు రైతు, తుంగతుర్తి

సాగుకు నీళ్లిప్పించలేని దద్దమ్మ మంత్రులు


● బుడ్డర్‌ఖాన్, జోకర్‌లా మాట్లాడుతున్న జిల్లా మంత్రి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అవకాశమున్నా సాగు కోసం నీళ్లు ఇప్పించలేకపోయిన దద్దమ్మలు జిల్లా మంత్రులు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నలమోతు భాస్కర్‌రావుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రులకు రైతుల సమస్యలపట్ల చిత్తశుద్ధి లేకపోవడం, అవగాహన రాహిత్యంతో పంటలు ఎండే దుస్థితి దాపురించిందన్నారు. జిల్లాలో కాల్వకట్టల మీద పోలీస్ బందోబస్తుతో తాగునీటిపేరుతో దిగువ ప్రాంతాలకు నీరు తీసుకెళ్తున్నా జిల్లా రైతులకు నీరు ఇప్పించలేకపోయారని దుయ్యబట్టారు. వేసిన పంటలు కాపాడుకునేందుకు గడచిన 50 రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మంత్రులు, ఎమ్మెల్యేలు సోయిలేకుండా ఉన్నారని, రైతుల బాధలు తీర్చేందుకు కనీసం ఆలోచన చేయలేదని విమర్శించారు. కాళేశ్వరం, సాగర్ ప్రాజెక్టుల నుంచి ఒక్క తడికీ నీరిప్పిస్తే ఉమ్మడి జిల్లాలో లక్షల ఎకరాల పంట రైతులకు దక్కేదన్నారు. గడచిన మూడునెలల్లో 100 టీఎంసీల నీటిని తీసుకునే అవకాశమున్నా ప్రభుత్వ అవగాహన రాహిత్యంతో రైతులకు అన్యాయం జరిగిందని, లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి రైతులు నష్టపోయారని వివరించారు. జిల్లాలో రైతులను సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రయత్నించాల్సిన సీఎం, మంత్రులు ఆ విషయాన్ని వదిలేసి, ఇక్కడ వసూలు చేసి ఢిల్లీకి పంపేపనిలో ఉన్నారని ఆరోపించారు. మిల్లర్లు, కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ జిల్లా మంత్రి తాను మంత్రిననే సోయిలేకుండా జోకర్‌లా, బుడ్డర్‌ఖాన్‌లా వ్యవహరిస్తున్నారని అన్నారు. మిల్లర్ల వద్ద కోట్లాదిరూపాయలు వసూళ్లకు పాల్పడ్డారని, దాన్ని పూడ్చుకునేందుకు మిల్లర్ల సన్నవడ్లకు సైతం ధర తగ్గించి కొంటున్నారని ఆరోపించారు. మంత్రి పర్యటన సమయంలో రైతులు ధర విషయం ఆయన దృష్టికి తేగా, మిల్లులను సీజ్‌చేయాలని చెప్పారని, కానీ ఆయన అక్కడి నుంచి వెళ్లగానే ఇంకో వంద రూపాయల ధర తగ్గించారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ సీజన్‌లోనూ సన్న ధాన్యానికి రూ.2700కు తక్కువ ధర ఇప్పించలేదన్నారు. రైతులు కష్టాల్లో ఉన్నందున వారిని పరామర్శించేందుకు, వారికి అండగా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నారని, ఆయనకు ఆరోగ్యం సహకరించకున్నా రైతులను పరామర్శించాలనే ఉద్దేశంతో వస్తున్నారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. డీసీసీబీ చైర్మన్ వై.విజయేందర్‌రెడ్డి, గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, రైతుబంధుసమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, నాయకులు కటికం సత్తయ్య గౌడ్, దేప వెంకటరెడ్డి, తండు సైదులు, బొమ్మరబోయిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

ఇంటిబాట పట్టిన హాస్టల్ విద్యార్థులు


విద్యార్థులు, ప్రయాణికులతో కిక్కిరిసిన భువనగిరి బస్టాండ్

నల్లగొండ / భువనగిరి రూరల్ / సూర్యాపేట అర్బన్, మార్చి 30 : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు శనివారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో పరీక్షాల కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఎటువంటి అవాంతరాలు జరుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కాగా పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంలో మునిగిపోయారు. హాస్టల్ విద్యార్థులు ఇంటిబాటపట్టారు. దీంతో బస్టాండ్లు బస్టాండ్లు విద్యార్థులు, తల్లిదండ్రులతో కిక్కిరిశాయి.నల్లగొండ జిల్లాలో 109 పరీక్షా కేంద్రాలల్లో పరీక్షలు నిర్వహించగా చివరి రోజు 19,332మంది విద్యార్థులకు 19,269 మంది హాజరయ్యారు. 63మంది గైర్హాజరయ్యారు. మొత్తం 45 పరీక్షా కేంద్రాలను అధికారులు సందర్శించారు. చివరి రోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. యాదాద్రిభువనగిరి జిల్లాలో 51 పరీక్షా కేంద్రాల్లో 9,130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అదేవిధంగా భువనగిరిలోని ఒక ప్రైవేట్ పరీక్షా కేంద్రంలో 161 మంది పరీక్షకు హాజరయ్యారు. సూర్యాపేట జిల్లాలో 67 పరీక్షా కేంద్రాల్లో 11,946మంది విద్యార్థులకు 11,905 మంది హాజరయ్యారు. 41మంది గైర్హాజరు కాగా ప్రైవేట్ విద్యార్థులు ఇద్దరూ పరీక్షకు హాజరయ్యారని డీఈవో అశోక్ తెలిపారు.ఇదిలా ఉండగా పదో తరగతి ప్రధాన పరీక్షలు ముగియడంతో ఏప్రిల్ 1వతేదీన ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన ఒక పరీక్ష మాత్రమే మిగిలి ఉంది.

ఎన్నికల విధుల్లో ఉండేవారికి పోస్టల్ బ్యాలెట్



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, పాల్గొన్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట అర్బన్, మార్చి 30 : పార్లమెంట్ ఎన్నికల విధుల్లో ఉండే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యంపై హైదరాబాద్ నుంచి కలెక్టర్ వెంకటరావుతో పాటు జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, ఇతరుల వివరాలను పొందుపర్చాలని ఆదేశించారు. ఉద్యోగుల నుంచి ఫాం-12ను తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు పర్చేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. ఏప్రిల్ 29వతేదీ నాటికి అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అత్యవసరసేవల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్‌బ్యాలెట్ కోసం రిటర్నింగ్ అధికారికి ఏప్రిల్ 23వ తేదీలోపు ఫారం-12ను సమర్పించాలన్నారు. మే 3వ తేదీ నుంచి మే 6వ తేదీ వరకు మొదటిదశ, మే 8వ తేదీన రెండో దశ ఇంటివద్ద పోలింగ్ పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటరావు మాట్లాడుతూ నోడల్ అధికారులకు కేటాయించిన అన్నిపనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత,డీఎఫ్‌వో సతీష్‌కుమార్, జడ్పీ సీఈవో అప్పారావు, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, డీఈవో అశోక్, డీఏవో శ్రీధర్‌రెడ్డి, ఆర్టీవో సురేష్‌రెడ్డి, డీఎస్‌వో మోహన్‌బాబు, డీసీవో పద్మ, తహసీల్దార్లు,ఎన్నికల పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో వివిధ హోదాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్(వీఎఫ్‌సీ)లను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం పోలీస్, విద్యుత్, వైద్యం, ఆర్టీసీ, పౌరసరఫరాల, అగ్నిమాపక, సమాచార, రవాణా శాఖల వారీగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై సమీక్షించారు.

ఎన్‌సీసీ యూనిట్ మంజూరుకు కృషి


ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఎన్‌సీసీ అధికారులు

కోదాడ టౌన్, మార్చి 30 : కోదాడ పట్టణంలోని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరుకు కృషి చేస్తామని ఎన్‌సీసీ సుబేదార్ షకీల్ అహ్మద్ తెలిపారు. శనివారం కేఆర్ఆర్ కళాశాలను ఎన్‌సీసీ అధికారులు నాయబ్ సుబేదార్ కే జగన్నాథం, హవల్దార్ విష్ణుసింగ్‌లతో కలిసి కళాశాల భవనం, క్రీడాప్రాంగణం, ఎన్‌సీసీ రూం, సెమినార్ హాల్, ఇతర వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 45 ఎకరాలు గల అతిపెద్ద కళాశాల కేఆర్ఆర్ కళాశాలకు త్వరలో ఎన్‌సీసీ యూనిట్ మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు ఎన్‌సీసీ అధికారులకు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు, అధ్యాపక బృందం, విద్యార్థులు పూలబొకే అందించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, ఎస్ రామారావు, ఏ నిర్మల, సత్యవాణి, పీ సైదులు, శ్రీదేవి, ఎన్ఎం రఫీ, టీ రాజు, సైదమ్మ, రాజు, సుమలత, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దంచుతున్న ఎండలు

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 43.1 డిగ్రీలుగా నమోదు



యాదగిరిగుట్టపై ఎండలో కాళ్లు కాలుతుండడంతో పరుగులు పెడుతున్న భక్తులు

నల్లగొండ, మార్చి 30: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. వడగాడ్పులతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వేసవితాపానికి పశు పక్ష్యాదులు విలవిల్లాడుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇంట్లో ఉగడికి తట్టుకోలేక వృద్ధులు నానా తంటాలు పడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శనివారం 43.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదగిరికొండపై భక్తులు ఎండలకు ఇబ్బందులు పడ్డారు. కాళ్ల కింద బండలు కాలుతుండడంతో పరుగులు పెట్టడం కన్పించింది. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం శివన్నగూడెంలో అత్యధికంగా 43.1 డిగ్రీలు, అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 37.7 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాలలో అత్యధికంగా 42.2, తుర్కపల్లి మండలం మన్నెవారి తుర్కపల్లిలో అత్యల్పంగా 36.7 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణం లక్కవరం రోడ్‌లో అత్యధికంగా 43.0 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తి మండలంలో 37.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్థ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్



(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయకులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే.! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమాయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

రైతుల ఇబ్బందులను పట్టించుకోకపోవడం శోచనీయం

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మల్లేష్

భువనగిరి రూరల్, మార్చి 30: రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. శనివారం భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసేవకు మాత్రమే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. గతంలో భువనగిరి ఎంపీగా పనిచేసిన బూర నర్సయ్యగౌడ్ భువనగిరికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యవహారం ఉందన్నారు. రాహుల్ గాంధీ సంతకం ఫోర్జరీ చేసిన విషయంలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేసిన విషయం ఈ ప్రాంత ప్రజలకు తెలిసిందేనన్నారు. భువనగిరి పార్లమెంట్ ఓటర్లు ఆలోచించి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అబద్దాలు, అహంకారపు మాటలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతన్నలకు భరోసా కల్పించేందుకు ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. విలేఖరుల సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిషోర్, పోచంపల్లి ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, మాజీ మునిసిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు కొలుపుల అమరేందర్, గాదె నరేందర్‌రెడ్డి, జనగాం పాండు, ర్యాకల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, బల్గూరి మధుసూదన్‌రెడ్డి, జక్క రాఘవేందర్‌రెడ్డి, కంచి మల్లయ్య, నీల ఓంప్రకాశ్, అబ్బగాని వెంకట్, పడమటి మమత, కొనపురి కవిత, బబ్లూ, సురిపంగ సుభాష్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి పార్టీ మారుతున్నారా?

మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పార్టీ మార్పుపై విలేఖరులు ప్రశ్నించగా మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిషోర్‌లు స్పందించారు. పైళ్ల శేఖర్‌రెడ్డి పార్టీ మారే ఆలోచన లేదని, తమతో కలిసి ఉంటున్నారని, పార్టీ చేపట్టబోయే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని అన్నారు. వాస్తవానికి ఈ రోజు జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయనకు సమాచారం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జిట్ట బాలకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఈ సమావేశానికి గైర్హాజరు కావడంపై పలువురు గుసగుసలాడుకున్నారు.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఎండిన పంటలు

● బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

నల్లగొండ, మార్చి 30: కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాల వల్లే నేడు పంటలు ఎండిపోయాయని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విమర్శించారు. నల్లగొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పంటలు ఎండిపోతున్నా, జిల్లాకు చెందిన మంత్రులు కనీసం సమీక్షా సమావేశాలు నిర్వహించకుండా కనీసం నష్ట పరిహారం ఇవ్వడం లేదని అన్నారు. గత ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గెలిచిన కాంగ్రెస్ రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మళ్లీ అబద్ధాలతో వస్తుందని దీనిని ప్రజలు తమనించి తగు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మాట మీద ఉండే మోదీ వైపు దేశమంతా చూస్తుందని పేర్కొన్నారు. దేశాన్ని నడిపించగల సమర్థులు కేవలం నరేంద్రమోదీ మాత్రమేనని పేర్కొన్నారు. దేశంలో, జిల్లాలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, చింతల రామచంద్రం మాట్లాడుతూ బీజేపీని నిలువరించాలని, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్నో ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తమతో 8 మంది బీజేపీ నేతలు టచ్‌లో ఉన్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరు టచ్‌లో ఉన్నారో బహిరంగంగా చెప్పాలని డిమండ్ చేశారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అహంకారానికి ఓటు వేశారే తప్ప కాంగ్రెస్‌పై ప్రేమతో కాదని పేర్కొన్నారు. నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బండారు ప్రసాద్, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బొబ్బల భాగ్యరెడ్డి, పోతేపాక సాంబయ్య పాల్గొన్నారు.

సమావేశానికి హాజరుకాని నేతలు

బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి శనివారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశం, విలేకరుల సమావేశానికి జిల్లాలో పోటీచేసిన ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు స్థానిక నేతలు కూడా హాజరు కాకపోవడంతో చర్చకు దారితీసింది. శానంపూడి సైదిరెడ్డికి ఎంపీ టికెట్ రావడం ఇష్టం లేకనే సదరు నేతలు హాజరు కాలేదని, కిందిస్థాయి నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మొత్తంగా సైదిరెడ్డికి టికెట్ ఇవ్వడం స్థానిక బీజేపీ నేతలు వర్గాలుగా చీలిపోయినట్లు స్పష్టంగా అర్థమవుతోంది.



నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరైన కార్యకర్తలు

కాంగ్రెస్‌లో జోష్

మఠంపల్లి, మార్చి 30: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సభ విజయవంతమైంది. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి మహాక్షేత్రంలో నిర్వహించిన ఈ సభకు ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మట్టపల్లిలో నాయకులు, కార్యకర్తల కోలహలం నెలకొంది. ఎండ తీవ్రంగా ఉన్నా సైతం లెక్క చేయకుండా నాయకులు, మహిళలు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఎస్‌సీఎల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మంత్రులకు ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నాయకులు స్వాగతం పలికారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండనవీన్ మంత్రులు, ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో దీపాదాస్ మున్షి, మంత్రులను పార్టీ నాయకులు గజామాలలు, శాలువతో ఘనంగా సత్కరించారు. సమావేశానికి వచ్చే వారికి ఆర్యవైశ్య, రెడ్డిసత్రం, మున్నూరుకాపు, 10సభ కమిటీ సభ్యులు మంచినీటి, భోజన సౌకర్యాలు కల్పించారు. సభ విజయవంతం కావడంతో కార్యకర్తల్లో జోష్ నింపింది. సమావేశంలో ఎమ్మెల్యేలు కందూరు జైవీర్‌రెడ్డి, నేనావత్ బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు ఇస్లావత్ శంకర్‌నాయక్, చెవిటి వెంకన్నయాదవ్, సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, భూక్యమంజూనాయక్, భూక్య గోపాల్, తన్నీరు మల్లికార్జున్‌రావు, ఆదూరి కిషోర్‌రెడ్డి, సుబ్బారావు, రాంరెడ్డి, డీవీఆర్, అల్లం ప్రభాకర్‌రెడ్డి, అప్పారావు, భీముడు, కరీం, సక్కునాయక్, సింగారపు సైదులు, సదేశ్వరరావు, గూడెపు శ్రీనివాస్, ఎల్లారెడ్డి, బాబునాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీపాదాస్ మున్షికి స్వాగతం పలుకుతున్న జానా, ఉత్తమ్, కోమటిరెడ్డి



అభివాదం చేస్తున్న జయవీర్, రఘువీర్, ఎమ్మెల్యే బీఎల్ఆర్



దాస్‌మున్షిని సన్మానిస్తున్న ఉత్తమ్, హుజూర్‌నగర్ నాయకులు



సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు



నల్లగొండలో నవోదయం సీడీని ఆవిష్కరిస్తున్న దీపాదాస్ మున్షి తదితరులు



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి

కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వం : ఆర్డీఆర్

సూర్యాపేటఅర్బన్, మార్చి 30: కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వమని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో శానిటైజేషన్ విభాగంలో పనిచేసిన వారిని సూపరింటెండెంట్ ఏడాది క్రితం విధుల నుంచి తొలగించారు. వారిని తిరిగి ఉద్యోగంలో తీసుకున్న సందర్భంగా ఉద్యోగులు జిల్లాకేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దామోదర్‌రెడ్డిని గురువారం కలిశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ జనరల్ ఆసుప త్రిలో అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. డబ్బులు తీసుకొని నచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. కారణం లేకుండా ఉద్యోగులను విధుల నుంచి తొలగించారన్నారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా శోభారెడ్డి

సూర్యాపేట సిటీ, మార్చి 30: పెన్‌పహాడ్ మండలానికి చెందిన కేసరి శోభారెడ్డి బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. శోభారెడ్డికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు జిల్లా కేంద్రంలో గురువారం నియామకపత్రం అందజేశారు. తన నియామానికి సహకరించిన పార్టీ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలగాని ధనుంజయ్‌గౌడ్, సలిగంటి వీరేందర్, పల్స మల్సూర్‌గౌడ్, ఎండీ. అబీద్, అరూరి శివ, కొప్పుల కాంత్రిరెడ్డి, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న సంకినేని

సొసైటీ చైర్మన్‌గా కొండా సైదులు బాధ్యతల స్వీకరణ

చిలుకూరు, మార్చి 30: మండలంలోని పాలె అన్నారం ప్రాథమిక సహకార సంఘ చైర్మన్‌గా కొండా సైదయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా ఉన్న కొండా సైదయ్య సంఘ నిధులు సొంతానికి వాడుకున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వారం రోజుల క్రితం తాత్కాలిక చైర్మన్‌గా మట్టయ్యను నియమించారు. అయితే సహకార సంఘ చైర్మన్‌గా తనను తొలగించడంపై సైదయ్య కోఆపరేటివ్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించారు. దీంతో కొండా సైదయ్య సస్పెన్షన్‌పై కోర్టు స్టే ఇవ్వడంతో తిరిగి సైదయ్యను సంఘ చైర్మన్‌గా నియమిస్తూ జిల్లా సహకార సంఘ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం సంఘం సీఈవో సాకి బాబు సంఘ చైర్మన్‌గా కొండా సైదయ్యకు తిరిగి బాధ్యతలు అప్పగించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సైదులు

పుప్పాల సత్తెమ్మ ఆశయ సాధనకు కృషిచేయాలి

ఆత్మకూర్ (ఎస్), మార్చి 30: పుప్పాల సత్తెమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి. కోటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పుప్పాలగూడెంలో శనివారం టీపీటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పుప్పాల వీరన్న మాతృమూర్తి పుప్పాల సత్తెమ్మ సంతాప సభ నిర్వహించారు. సీపీఎం నిర్ణయాలకు కట్టుబడి, గ్రామంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేశారన్నారు. అర్ధరాత్రి ఇంటికి వచ్చిన విప్లవకారుల బాగోగులు చూసేవారని అన్నారు. అమర వీరుల ఆశయసాధనకు యువత ముందువరసలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, టీపీటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పుప్పాల వీరన్న, రాష్ట్ర నాయకులు సుభాన్, పుప్పాల రవికుమార్, లక్ష్మయ్య, డేగల జనార్ధన్, రంగారెడ్డి, నాగయ్య, కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, ఉదయగిరి, రేపాక లింగయ్య ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరగొద్దు

చివ్వెంల, మార్చి 30: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని తహసీల్దార్ క్రిష్ణయ్య హెచ్చరించారు. మండలకేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో కొనుగోలు కేంద్రాలపై సిబ్బందికి శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందేలా చూడాలన్నారు. తూకంలో కానీ సిబ్బంది అవసరాల నిమిత్తం కానీ రైతులను ఇబ్బంది పెట్టి మోసం చేసే చర్యలు తీసుకుంటే ఉపేక్షించే పనే లేదని క్రిమినల్ కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

మేళ్లచెర్వు, మార్చి 30: మండలకేంద్రంలోని మైహోం ఇండస్ట్రీలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక శోభతో రెండోరోజు కొనసాగుతున్నాయి. 26వ బ్రహ్మోత్సవాలో భాగంగా శనివారం స్వామి వార్లకు తిరుపై సేవ, తిరు వీధి ఉత్సవం, ధ్వజారోహనం, విష్ణు సాహస్ర పారా నామా పారాయణము నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు రామోహన్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం ఆచరణీయం

సూర్యాపేటఅర్బన్, మార్చి 30: లోకరక్షకుడు ఏసుక్రీస్తు చూపిన మార్గం ఆచరణీయమని సెంటినరీ బాప్టిస్టు చర్చి సంఘ కాపరి డాక్టర్ ఎం. ప్రభుదాస్, పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ మామిడి శ్యాంసన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రన్‌ఫర్ జీసస్ ర్యాలీని శనివారం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శాంతి, కరుణ కలిగి ఉండాలన్నారు. ప్రపంచ శాంతిని కోరుతూ ఏసుక్రీస్తు సిలువను మోసి ప్రతి ఒక్కరి పాపాలను కడిగారని తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు తీసుకొస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జాకబ్, బాబురావు, జోహర్‌పాల్, జలగం డేవిడ్‌రాజ్, మత్తయి పాల్గొన్నారు.



రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

'మాదిగ నాయకుల ధోరణి మారాలి'

సూర్యాపేటటౌన్, మార్చి 30: మాల కుల సమాజంపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకుల ధోరణి మారాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసెన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలకు ఎంపీ టికెట్ ఇవ్వరాదని తాము కోరిన వారికే ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీని బ్లాక్‌మెయిల్ చేయడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం జనాభాలో 60లక్షల జనాభా ఉన్న మాలలను 18 లక్షల మంది ఉన్నారని మాదిగలు ప్రచారం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొల్లెద్దు గోపయ్య, ఏడిండ్ల అశోక్, గాజుల నర్సయ్య, పెరుమాళ్ళ రాజరావు, వెంకటనర్సయ్య, సైదులు, అశోక్ పాల్గొన్నారు.

ముదురుతున్న టోకెన్ల పంచాయితీ

● కార్యదర్శులకు ఇన్‌చార్జి ఎంపీడీవో మధ్య వాదనలు

మోతె, మార్చి 30: మోతె మండల ఎంపీవోగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన హరిసింగ్‌నాయక్, గ్రామకార్యదర్శులకు మధ్య 14వ ఆర్థిక సంఘానికి సంబంధించిన డిజిటల్ టోకెన్ల గొడవ జరుగుతోంది. గ్రామ పంచాయితీ డిజిటల్ టోకెన్లు కార్యదర్శులకు ఇవ్వకుండా ఇన్‌చార్జి ఎంపీడీవో తనవద్దే ఉంచుకోవడంతో గొడవలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధానం టోకెన్లు అధికారి తన వద్ద పెట్టుకోవడం, గ్రామ కార్యదర్శులు అడిగితే చెల్లించిన వాటికి సంబంధించిన క్యాష్‌బుక్‌లో తప్పులు ఉన్నాయని, ఏదో ఒక సాకు చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామ కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. శనివారం ఓ గ్రామ కార్యదర్శి ఇన్‌చార్జి ఎంపీడీవోను టోకెన్ల విషయమై కార్యాలయంలోనే నిలదీశాడు. సర్పంచుల పదవీకాలంలోనూ ఆ అధికారి వద్దనే ఉంచుకున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం కార్యదర్శులు తమ సొంతంగా లక్షకు పైగానే డబ్బులు ఖర్చు చేశారు. టోకెన్ల ద్వారా డబ్బులు తీసుకోవాలంటే టోకెన్లు ఆ అధికారి వద్దే ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామ కార్యదర్శులు వాపోతున్నారు. మండలంలో 29గ్రామపంచాయతీలు ఉండగా అందులో కొన్ని గ్రామాలకు మాత్రమే పెట్టిన డబ్బులు టోకెన్ ద్వారా తీసుకున్నారు. తుమ్మగూడెం కార్యదర్శి విధుల్లో లేకపోయినా ఇటీవల వెంటనే డబ్బులు డ్రా చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఈ సంఘటనలపై ఇటీవల జడ్పీ సీఈవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ టోకెన్ల విషయమై జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్‌ను వివరణ కోరగా జిల్లాలో ఏ మండలంలో కూడా మండల అధికారుల వద్ద టోకెన్లు లేవని, గ్రామ కార్యదర్శుల వద్ద మాత్రమే ఉన్నాయని తెలిపారు. మోతె మండలంలో టోకెన్ల విషయాన్ని పరిశీలించి కార్యదర్శులకు అప్పగిస్తారని తెలిపారు.



మోతె మండల పరిషత్ కార్యాలయం

ఏం అభివృద్ధి చేశారో చెప్పి తుంగతుర్తికి రావాలి

తిరుమలగిరి, మార్చి 30: బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల అధికారంలో ఉండి తుంగతుర్తి నియోజకవర్గానికి ఏమి అభివృద్ధి చేశారో మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పి నియోజకవర్గంలో పర్యటించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ డిమాండ్ చేశారు. తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగతుర్తిలో మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేల పుణ్యమాని బిక్కేరు వాగులో ఇసుక ఎత్తుకపోవడంతో బోర్లు వట్టిపోయి, భూగర్భజలాలు తగ్గిపోయాయన్నారు. మీరు పరిశీలించాలంటే ముందుగా బిక్కేరు వాగును పరిశీలించాలన్నారు. పదేళ్ల కాలంలో తుంగతుర్తిలో ఇసుక, ల్యాండ్, మాఫియా, బెదిరింపులతో వ్యవస్థను భ్రష్టుపట్టించి, అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిపారన్నారు. కమీషన్లకు కాళేశ్వరం కూలిపోయేట్టుందన్నారు. ఎస్సారెస్పీ కాల్వలు తవ్వింది, నీళ్ల విడుదల చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఎండాకాలంలో రైతులకు ఇబ్బందులు కలగొద్దని నీళ్ల విడుదల చేస్తూనే ఉన్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు రాజకీయంగా లబ్ధిపొందడం కోసమే కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వస్తున్నారన్నారు. రాజరిక పాలన అంతం అయిందని, ఇప్పుడు ప్రజాపాలన వచ్చిందని, అధికారం పోయాక కేసీఆర్‌కు రైతులు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై. నరేష్, నాయకులు పేరాల వీరేష్, జుమ్మిలాల్, పాలకుర్తి రాజయ్య, కందుకూరి అంబేడ్కర్, కందుకూరి లక్ష్మయ్య, పాశం యాదవరెడ్డి, బత్తుల శ్రీను, శాగంటి రాములు, భాస్కర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

సూర్యాపేటటౌన్, మార్చి 30: దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మఠంపల్లిలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి బయలుదేరుతున్న కాంగ్రెస్ వాహన శ్రేణులకు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తు పూర్తి అవినీతిమయంగా మారిందన్నారు. రైతుల, కార్మికుల హక్కులను కాలరాసేలా బీజేపీ ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకొస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రాజా, గట్టుశ్రీనివాస్, షఫీఉల్లా, వెలుగు వెంకన్న, స్వామినాయుడు, వల్దాస్ దేవేందర్, నేరేళ్ళమధుగౌడ్,కొండగడుపుల సూరయ్య, జ్యోతుల కర్నాకర్, దొండిరెడ్డి సైదిరెడ్డి, దరావత్‌రాజు, దర్మానాయక్, సాజిద్‌ఖాన్, నేరేళ్ళ సోమయ్య, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేష్‌రెడ్డి

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఆత్మకూర్(ఎస్), మార్చి 30: ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందజేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి రైతులకు సూచించారు. మండల పరిధిలోని పాతర్లపహాడ్‌లో శనివారం మండల పశువైద్యశాఖ అధ్వర్యంలో పశువులకు ఉచితంగా సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ టీకాల వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. పశువులకు అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాల వివరాలను మండల పశు వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రావు అను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 397 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. వైద్య శిబిరం పూర్తి అయ్యే నాటికి మండలంలో ఉన్న అన్ని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయాలని మండల పశువైద్యాధికారిని ఆదేశించారు.

కోదాడ రూరల్: జిల్లాలోని ప్రతి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాల కార్యక్రమం జరుగుతుందని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారి కుమారస్వామి తెలిపారు. శనివారం మండల పరిధిలోని గోండ్రియాల పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ టీకాల కార్యక్రమం ఏప్రిల్ 14వరకు కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 50 శాతం వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం పూర్తయిందని, రాబోయే వారం రోజుల్లో వంద శాతం పూర్తిచేసేలా, జిల్లాలో ప్రతి పశువుకు వ్యాక్సినేషన్ చేసి గాలికుంటు వ్యాధిని సమగ్రంగా నిర్మూలించే ప్రణాళికతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోండ్రియాల జూనియర్ పశువైద్యాధికారి ఎంఏఎం ఖాన్, పంచాయతీ కార్యదర్శి వీర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పాతర్లపహాడ్‌లో శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కుమారస్వామి

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

కోదాడ రూరల్, మార్చి 30: రాష్ట్ర వ్యాప్తంగా రబీ సీజన్‌లో ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన రైతు సంఘం సమావేశంలో మాట్లాడారు. ఈ రబీ సీజన్‌లో రైతాంగం వేలాది ఎకరాల్లో వరిపంట వేసి భూగర్భజలాలు అడుగంటిపోయినందున సాగర్ ఎడమకాల్వ నీటి విడుదల లేక వేసిన పంటలు ఎండిపోయాయన్నారు. దీంతో రైతాంగం తీవ్ర నష్టానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వ్యవసాయాధికారులు ఎండిపోయిన పంటలను పరిశీలించి ఎకరాకు రూ. 30 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. వీరితో పాటు వందల ఎకరాలు కౌలుకు చేసిన రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఏనుగుల వీరాంజనేయులు, సంగమయ్య, గొర్రె ముచ్చు మరియన్న, ముత్యాలు, కే.వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఆత్మకూర్(ఎస్): దోపిడీ లేని సమాజాన్ని నిర్మించడమే భగత్‌సింగ్ లక్ష్యమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఏపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సభలో మాట్లాడారు. చిన్న వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించరాన్నారు. కార్యక్రమంలో నాయకులు గంటా నాగయ్య, కునుకుంట్ల సైదులు, కంచనపల్లి సైదులు, బండి రవి, ఎస్‌కే జిలేరు, నల్లగొండ నాగయ్య, మధు, పిడమర్తి భరత్, ఎర్ర ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండల పరిధిలోని కొమరబండ తేజ విద్యాలయంలో 'మా బడి, జ్ఞాపకాల ఒడి' అనే పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. విద్యార్థులు వారి పాఠశాల జ్ఞాపకాలను అక్షర రూపంలోకి మార్చి రాసిన ప్రతులను పాఠశాల యాజమాన్యం పుస్తక రూపంలో ప్రచురించింది. మొత్తం 38మంది విద్యార్థులు వారు రాసిన పాఠశాల జ్ఞాపకాలను మా బడి, జ్ఞాపకాల బడి అనే పేరుతో పుస్తకంగా అచ్చు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, కోదాడ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీధర్‌రెడ్డి, వైద్యులు జాస్తి సుబ్బారావు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ఎండిన పంటల వద్ద ఫొటోలకు ఫోజులు ఇస్తూ రాజకీయ పార్టీలు చౌకబారు ప్రకటనలు ఇవ్వడం మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కరువులు అనేవి ప్రకృతి వైపరిత్యాల వల్ల వస్తున్నవే కాని ప్రభుత్వాలు, పార్టీల వల్ల కాదన్నారు.

హుజూర్‌నగర్: పూజా సామాగ్రి విక్రయానికి మండలంలోని బూరుగడ్డ వేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా సామాగ్రి, పూలు, పండ్లు అమ్ముకునే హక్కును గువ్వల ఆంజనేయులు రూ.16,500లకు దక్కించుకున్నారు. స్వామివారి వస్త్రాలను సేకరించుకునే హక్కును కొత్తా ప్రవీణ్‌కుమార్ రూ.9,500లకు దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పలు సేకరించేనుకునే హక్కును కీర్తి నర్సయ్య రూ.5వేలకు వేలం పాడారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి టీవీ చలపతి, ఈవో లక్ష్మణ్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గండు సైదులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

గరిడేపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం నాయకుడు చింతకాయల రామచంద్రయ్య మృతి పార్టీకి తీరనిలోటని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ అన్నారు. మండలంలోని కీతవారిగూడెంలో రామచంద్రయ్య పార్థీవదేహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల సైదయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకయ్య, శ్రీను, రాఘవయ్య, సత్యానారాయణ, వీరరాఘవయ్య, లక్ష్మయ్య, సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: విద్యార్థుల ఉన్నతాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎండీఆర్ విద్యా సంస్థల చైర్మన్ మేరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎండీఆర్ పాఠశాలలో 15వ వారిక్షొకోత్సవం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డీఎస్ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు దగ్గుపాటి బాబూరావు కోరారు. శనివారం పట్టణంలోని మహిళకు ఓ పాజిటివ్ రక్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్క్స్, ముల్కలపల్లి రాంబాబు, గోపి పాల్గొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ సైదయ్య తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మతుల కోసం చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మద్దిరాల: ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు పేర్ల నాగయ్య డిమాండ్ చేశారు. శనివారం మద్దిరాల మండల పరిదిలోని రెడ్డిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఆయన పనులను పరిశీలించి మాట్లాడారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొడ్డలి నర్సయ్య, నాగెల్లి శ్రీనివాస్, గుండాల వెంకన్న, నాగేంద్రచారి, ధనమ్మ, వెంకటమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

తిరుమలగిరి: తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు పోరెళ్ల దాసు ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. పోరెళ్ల దాసు వర్ధంతి సందర్భంగా శనివారం మునిసిపల్ కేంద్రంలో దాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, కడెం లింగయ్య, కొత్తగట్టు మల్లయ్య, తన్నీరు రాంప్రభు, తాటికొండ సీతయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వీటీకేలకు ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహనలో మాట్లాడారు. వేసవి కాలంలో టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గించవద్దన్నారు. సమావేశంలో ఏవో శశిదర్‌రెడ్డి, ఏపీఎం మల్లేష్, ఏఈవో సత్యం పాల్గొన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణంలో శనివారం రాత్రి పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఐ రవీందర్‌నాయక్, ఏఎస్ఐ చారి ఆధ్వర్యంలో ఆర్మీ పోలీసులు కవాతు నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు కవాతు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కవాతులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోదాడ రూరల్: మండలంలోని గుడిబండ గ్రామంలో ఓ ఆవుకు ఒకే ఈతలో రెండు దూడలు జన్మించాయి. గ్రామానికి చెందిన కునుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో ఆవుకు శనివారం ఒకే ఈతలో రెండు దూడలు జన్మించినట్లు తెలిపారు. దూడలు, తల్లి క్షేమంగా ఉన్నాయన్నారు.

గరిడేపల్లి: మండల పరిధిలోని తాళ్ల మల్కాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాతికింది అంజయ్య, అనంతు రాములు, శేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, చెరుకు అంజయ్య, నాగరాజు, శివకృష్ణ, వెంకటనర్సయ్య, గోపాలం, గురుస్వామి, వెంకటేశ్వర్లు, నర్సయ్య, బండ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించడం అభినందనీయం

సూర్యాపేటఅర్బన్, మార్చి 30: సుదీర్ఘకాలంగా పోలీస్ శాఖలో వివిధ హోదాలో పనిచేసి ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మానించి మాట్లాడారు. పోలీస్ ఉద్యోగంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొంది 38 సంవత్సరాలు ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమన్నారు. పోలీస్ ఉద్యోగం నిత్యం సవాల్‌లో కూడికున్నదని, ఎన్నో రోజులు కుటుంబాలకు దూరంగా ఉంటూ సేవలు అందించాల్సి వస్తుందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, శ్రీకాంత్, అంజన్‌రెడ్డి, వెంకయ్య ఉన్నారు.

కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

తిరుమలగిరి, మార్చి 30: తుంగతుర్తి నియోజకవర్గంలో ఎండిపోయిన పొలాలను పరిశీలించడానికి రానున్న మాజీ సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్ రెడ్డి కోరారు. తిరుమలగిలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు మునిసిపల్‌కేంద్రంలో నిర్వహించే ర్యాలీకి బీఆర్ఎస్ శ్రేణులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సతీష్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, నరోత్తంరెడ్డి, ప్రవీణ్, కిషోర్, నాని పాల్గొన్నారు.

కమర్షియల్‌గా గ్యాస్ సిలిండర్లు వాడితే చర్యలు

సూర్యాపేటటౌన్, మార్చి 30: గృహ వినియోగానికి వాడే డొమస్టిక్ సిలిండర్‌లను కమర్షియల్‌కు వినియోగించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి మోహన్‌బాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని మధు గ్యాస్ ఏజెన్సీ, గాయిత్రి ఫిల్లింగ్ స్టేషన్, వాసు ఫిల్లింగ్ స్టేషన్లను శనివారం తనిఖీ చేశారు. తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో డీటీలు నాగలక్ష్మీ, రాజశేఖర్, రాంరెడ్డి, విజయశేఖర్, సివిల్‌సప్లయి ఆర్ఐ హస్సాన్ మహమద్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి మహాకుంభాభిషేకం

సూర్యాపేటఅర్బన్, మార్చి 30: జిల్లాకేంద్రంలోని శ్రీరామలింగేశ్వర దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నవగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్ర మంలో భాగంగా శనివారం మహా కుంభాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా నవగ్రహాలు, సర్వగ్రహ విగ్రహాల యంత్ర ప్రతిష్ఠోత్సవ మహోత్సవం, మహా పూర్ణాహుతి, జ్వాలతర్పణ దర్శనం, అవభృతస్నానములతో పాటు శ్రీరామలింగేశ్వరస్వామికి శాంతికల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలి'

నేరేడుచర్ల, మార్చి 30: అవినీతి బీఆర్ఎస్, మతతత్వ బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. నేరేడుచర్లలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక ఎజెండా రూపొందించి ఆర్ఎస్ఎస్ భావాలను ప్రజల్లో నింపాలని, మతాన్ని కులాన్ని పెంచి పోషిస్తూ దేశంలో విద్వేషాన్ని రెచ్చగొడుతున్నాయని ఆరోపించారు. మణిపూర్ సంఘటన దీనికి కారణమన్నారు. దళిత, బహుజన, మైనార్టీలను రాముడు పేరుతో ఈ దేశంలో జీవించే హక్కును కోల్పోయే విధంగా మారుస్తున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ ప్రధాన ముద్దాయిగా మిగిలిందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, నాయకులు వాసా పల్లయ్య, హుస్సేన్, వాసా కరుణాకర్, సందా సత్తెమ్మ, శ్రీను, పావని, మరియమ్మ, మల్లీశ్వరి, లక్ష్మి, రమణ, దుర్గ, మాలాంబి, లక్ష్మయ్య, కోటమ్మ పాల్గొన్నారు.

బెల్లం పానకం, సారా ధ్వంసం

మద్దిరాల, మార్చి 30: మండలంలోని మామిళ్లమడవ గ్రామ ఆవాస ప్రాంతాలైన ధరావత్‌తండా, పీర్యతండాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పానకం, సారాను శనివారం ధ్వంసం చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. తండాలకు చెందిన అంగోతు కాల్యా, ధరావత్ చోటి, అంగోతు బుజ్జితో పాటు మరికొంత వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 1000లీటర్ల బెల్లం పానకం, 20లీటర్ల సారా ధ్వంసం చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని తహసీల్దార్ అమీన్‌సింగ్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య, తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత, ఎస్ఐలు మూర్తి, గోపాలరావు, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లపల్లిలో చిన్నారిపై పిచ్చికుక్క దాడి

మఠంపల్లి, మార్చి 30: పిచ్చికుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుండ్లపల్లిలో శనివారం జరిగింది. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి గాబుల కోటేష్ మనవడు లోహిత్‌ఆక్షు ఉదయం ఇంట్లో ఆడుకుంటుండగా వ్యవసాయ పొల్లాల నుంచి వచ్చిన ఓ పిచ్చికుక్క చిన్నారి మూతి కొరికి కొంతదూరం ఈడ్చుకెళ్లింది. చిన్నారి అరుపులకు చుట్టూ పక్కల వారు సమయానికి వచ్చిన పిచ్చికుక్కను చుట్టూముట్టి చిన్నారిని రక్షించారు. తీవ్ర గాయలైన లోహిత్‌ఆక్షును మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు.

రూ.3.75 లక్షల నగదు పట్టివేత

కోదాడ రూరల్, మార్చి 30: మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శనివారం తనిఖీల్లో భాగంగా రూ.2 లక్షల నగదు పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి కారులో హైదరాబాద్ వెళ్తున్న జాస్తి వెంకటేశ్వరరావు వద్ద ఈ నగదు లభించిందన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా అనంతగిరి మండలంలోని శాంతినగర్ చెక్‌పోస్టు వద్ద రూ. 1.75 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం నుంచి కోదాడకు వస్తున్న రెండు కార్లను శాంతినగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా, ఒక కారులో రూ.లక్ష, మరో కారులో రూ.75వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ అధికారులపై నిందితుల దాడి

మేళ్లచెర్వు, మార్చి 30: సారా, నల్లబెల్లం, వినియోగంపై ఆరు కేసులు నమోదైన నిందితులు చింతలపాలెం మండలకేంద్రంలో ఎక్సైజ్ అధికారులపై దాడి చేశారు. చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గుగులోతు తులశాపై గతంలో అనేక ఎక్సైజ్ కేసులతో సహా ఈ నెల 28న అక్రమ మద్యం, కేసులు కేసు నమోదయ్యాయి. పరారీలో ఉన్న తులసియాను పట్టుకునేందుకు ఎక్సైజ్ ఎస్ఐ దివ్య సిబ్బందితో శనివారం కొత్తగూడెం తండాకు వెళ్లగా తులశా, అదే తండాకు చెందిన భూక్యా సత్యవతి ఎక్సైజ్ అధికారులను తీవ్ర పదజాలంతో దూషించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరు కోవడంతో నిందితులు రాళ్లు, బీరుసీసాలతో సిబ్బందితో దాడి చేశారు. స్థానిక సీసీ నాగరాజుతో పాటుగా ఎక్సైజ్ ఎస్ఐ దివ్యకు గాయాలయ్యాయి. రాళ్ల దాడిలో ఎక్సైజ్ అధికారుల వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఎక్సైజ్ ఎస్ఐ దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గుగులోతు తులశా, భూక్యా సరస్వతిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.